సాక్షి
వికారాబాద్

గురువారం । 23 । మార్చి । 2023



జాతరోత్సవాలు
తాండూరు పట్టణంలోని భావిగి భద్రేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. 8లో▸



ఘనంగా కవి సమ్మేళనం
వికారాబాద్ పట్టణంలో సాయంత్రం కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కవితలు, పద్యాలు వినిపించారు. 8లో▸



పోరుబాట
ప్రజా వ్యతిరేక విధానాలపై కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగడతామని సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య కోరారు. 9లో▸

న్యూస్‌రీల్

అధైర్యపడొద్దు అండగా ఉంటాం
ఎమ్మెల్యే ఆనంద్



మొత్కుపల్లిలో మిర్చి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

బంట్వారం: రైతులు అధైర్యపడవద్దని ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్థానిక ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ భరోసా ఇచ్చారు. కోట్‌పల్లి మండలం మొత్కుపల్లిలో వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అకాల వర్షాలతో పలు ప్రాంతాల్లో పంటలకు నష్టం జరగడం బాధాకరమన్నారు. ఉద్యాన, వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేస్తారన్నారు. నివేదిక ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుందరి అనిల్, పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడికి నంది అవార్డు



పద్మాకర్‌రావు

తాండూరు: పట్టణానికి చెందిన అర్చకుడు కరణం పద్మాకర్‌రావు ఉగాది నంది అవార్డుకు ఎంపికయ్యారు. ఉజ్వల సాంస్కృతిక సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉగాది నంది పురస్కారాలను వివిధ రంగాలలో ప్రతిభ కనబర్చిన వారికి అందిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదుగురిని ఎంపిక చేయగా అందులో చెన్‌గేష్‌పూర్ ఆంజనేయ స్వామి దేవాలయ అర్చకుడు కరణం పద్మాకర్‌రావు జ్యోతిష్య విభాగంలో ఎంపిక చేశారు. ఈ నెల 24న హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో అవార్డుతో సత్కరించనున్నారు.

కనిపించని నెలవంక..
రేపటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

తాండూరు: పవిత్రమైన రంజాన్ ఉపవాస దీక్షలకు ముస్లింలు సిద్ధమవుతున్నారు. అమావాస్య తర్వాత ఆకాశంలో నెల వంక కనిపించిన మరుసటి రోజు నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. బుధవారం ఆకాశంలో నెల వంక కనిపిస్తుందని ఎదురు చేశారు. కనిపించకపోవడంతో ఉపవాస దీక్షలు వాయిదా పడ్డాయి. శుక్రవారం నుంచి ఉపవాస దీక్షలు ఆచరించనున్నారు. వేసవి కాలంలో రంజాన్ మాసం రావడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక ప్రార్థనా మందిరాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు.

బస్‌స్టేషన్ ఆవరణలో చలివేంద్రం ప్రారంభం



తాండూరు బస్‌స్టేషన్‌లో చలి వేంద్రాన్ని ప్రారంభించిన చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్

తాండూరు: స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ వేసవి సీజన్‌లో ప్రజలకు చల్లని తాగునీరు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. తాండూరు ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

రామలింగేశ్వరాలయంలో అఘోరా పూజలు

ఆమనగల్లు: స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం దేరంబాబా (అఘోరా) ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశీ నుంచి రామేశ్వరం వెళ్తున్న దేరంబాబా తన శిష్యులతో కలిసి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు దేరంబాబా ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రేగటి శ్రీనివాస్, పూజారులు మల్లికార్జుస్వామి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



మర్పల్లి మండలం పట్లూరు గ్రామంలో జరిగిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు

షడ్రుచుల ఉగాది..

తెలుగు నూతన సంవత్సరాది శోభకృత్ నామ ఉగాది ఉత్సవాలను జిల్లా వాసులు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పంచాగ శ్రావణం విన్నారు. ఈ ఏడాది పరిస్థితులు ఏ విధంగా ఉంటాయే ఆలయ అర్చకులు భక్తులకు వివరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అదేవిధంగా ప్రతి ఇంట్లో పిండి పదార్థాలను, షడ్రుచులతో తయారు చేసిన పచ్చడిని కుటుంబ సభ్యులతో కలిసి సేవించారు. ఊరూరా ఉగాది పండుగ వాతావరణం కనిపించింది.

కల్పవృక్ష వాహనంపై
గోవిందుడు

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు కల్పవృక్ష వాహనంపై నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. కొడంగల్ పట్టణంలో పద్మావతీ సమేత మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉగాది పండుగను పురస్కరించుకొని పద్మావతి శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి మూల విరాట్టులకు విశేష పూలతో అలంకరణ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం శ్రీవారిని కల్పవృక్ష వాహనంపై మాడ వీధుల్లో ఊరేగించారు. మంగళవాయిద్యాలతో గోవింద నామ స్మరణలతో పురవీధులు మారుమోగాయి. – కొడంగల్



కొడంగల్ పట్టణంలో కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న బ్రహ్మాండనాయకుడు



విశేష అలంకరణలో ఉత్సవమూర్తులు

వట్టిపోతున్న బోర్లు.. ఎండుతున్న పైర్లు

- పంటలను కాపాడేందుకు పాట్లు
- చెరువులు, కుంటల్లో సైతం కానరాని నీరు
- అయోమయంలో అన్నదాతలు

దౌల్తాబాద్: వేసవి ప్రారంభంలోనే వ్యవసాయ బోర్లు వట్టిపోతున్నాయి.. ఫలితంగా పైర్లు ఎండుతుండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి సాగుచేస్తున్న పంటలు కళ్లెదుటే ఎండుముఖం పట్టడంతో దిక్కుతోచనిస్థితికి గురవుతున్నారు. పంటలు చివరి దశలో తడి అందించేందుకు రైతన్న పడుతున్న అష్టకష్టాలు అన్నీఇన్నీ కావు.. పంటలు చేతికొచ్చేవేళ ఈ దుస్థితి నెలకొనడంతో రైతులు తల్లడిల్లుతున్నారు.

కీలకదశలో నీటికొరత..

మండలంలో సుమారు 2వేల ఎకరాలకుపైగా వరి సాగు చేశారు. ప్రస్తుతం పొట్టదశలో ఉంది. చిరుపొట్ట దశ నుంచి గింజలో పాలునింపే వరకు ఎక్కువ మోతాదులో నీరు అవసరం ఉంటుంది. ఈ కీలక దశలో మండలంలో బోర్లు నీరు అడుగంటి ఎత్తిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంత మంది రైతులు ఏమి చేయాలో తోచక పక్క రైతుల బోర్ల నుంచి డబ్బులు వెచ్చించి నీటిని కొంటున్నారు. కొంత మంది ఎండిన పంటలను వృథాగా వదిలేస్తున్నారు.



దౌల్తాబాద్ శివారులో ఎండిన వరిపంట

ఉష్ణోగ్రత పెరుగుదలతో...

ప్రస్తుత పరిస్థితుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువ నమోదవుతున్నాయి. దీంతో బోరుబావుల్లో నీరు అడుగంటిపోతున్నాయి. మండలంలో చాలా గ్రామాల్లో బోర్లపై ఆధారపడి వేసిన వరిపంటలు చేతికి అందే పరిస్థితి కనిపించడంలేదు. చెరువులు, కుంటల్లో సైం నీరు ఇంకిపోతుండటంతో ముందుగా నీటి నిల్వలను బట్టి వేసుకున్న పొలాల్లో పంటలు ఎండిపోవడంతో రైతులు పశువులను మేపుతున్నారు.



వట్టిపోయిన వ్యవసాయ బోరు

“ కళ్లెదుటే ఎండిపోతోంది



బోరుకింద ఎకరంన్నర పొలంలో వరిసాగు చేశా. మొదట్లో నీరు బాగున్నాయని సాగు చేస్తే 15 రోజులుగా నీరు ఇంకిపోతున్నాయి. దీంతో పక్కపొలం నుంచి రూ.5వేలు ఖర్చు పెట్టి నీరు కొనుక్కొని పారిస్తున్నా. వేల రూపాయలు పెట్టబడులు పెట్టి సాగు చేసిన పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయి.

– బసయ్య, రైతు, దౌల్తాబాద్

తాగునీటికీ తిప్పలే..

ధారూరు: తాగునీటికీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరకొరగా అందుతున్న భగీరథ నీళ్లు.. మరోవైపు చాలా చోట్ల మోటార్లు మరమ్మతుకు నోచుకోవడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఇదిలా ఉంటే.. మండల వ్యాప్తంగా రెండు రోజుల నుంచి విద్యుత్ సరఫరా ఆయారాం, గయారాం అన్నట్లుగా ఉంది. భగీరథ తాగునీరు రెగ్యులర్‌గా వస్తుందనుకుంటే 3, 4 రోజులకోసారి రావడంతో ప్రజలు స్థానికంగా ఉన్న మోటారు బావులపై ఆధారపడుతున్నారు. చాలా గ్రామాల్లో మోటార్లు పనిచేయక మూలన పడ్డాయి. పనిచేసే బోర్లలో నీటి ధార సన్నగా వస్తోంది. భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడమే ఇందుకు కారణం.

మొరాయిస్తున్న మోటార్లు

గ్రామాలు, తండాల్లో మిషన్ భగీరథ పథకానికి ముందున్న తాగునీటి బోరుమోటార్లు పనిచేయక మొరాయిస్తున్నాయి. వీటిని బాగుచేయించాలన్నా పంచాయతీల్లో డబ్బులు లేని దుస్థితి. మండల కేంద్రంలో నిత్యం ఏదో ఒక కాలనీలో నీటి కష్టాలు ఎదుర్కొంటున్నా గ్రామ కార్యదర్శి పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపించారు. భగీరథ నీరు రావడం లేదని చెప్పినా ఎవరూ పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు. ఇకనైనా తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా క్రమం తప్పకుండా తాగునీటిని సరఫరా చేయాలని వారు కోరారు.



బోరు నుంచి వస్తున్న సన్నటి నీటి ధార

బాబోయ్.. ఎండ



రుమాలాలు, కొంగులు కప్పుకుని వెళ్తున్న బాటసారులు

వికారాబాద్ అర్బన్: రెండు రోజులుగా ఎండల తీవ్రత పెరిగింది. అకాల వర్షాలతో నాలుగు రోజుల పాటు చల్లబడ్డ వాతావరణం మళ్లీ వేడెక్కింది. ఉదయం 10గంటల నుంచి ఎండలు మండిపోతున్నాయి. సాయంత్రం 5గంటల వరకు కూడా వేడిమి తగ్గడం లేదు. ఆయా పనులపై పట్టణాలకు వచ్చే ప్రజలు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు తలపై కొంగు, రుమాలాలు వేసుకొని వెళ్తున్నారు.

మొక్క మొక్కకు నీరు అందిస్తూ..



అనంతగిరి రోడ్డులో ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీరు అందిస్తున్న సిబ్బంది

వికారాబాద్ అర్బన్: ఎండలు మండుతుండటంతో మొక్కలు ఎండిపోకుండా వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నారు. హరితహారంలో భాగంగా అటవీశాఖ నాటిన మొక్కలను రక్షించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నారు. అనంతగిరి అటవీ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కల చుట్టూ కంచెలను సైతం ఏర్పాటు చేశారు. రెండు మూడు రోజులుగా ఎండల తీవ్రత ఎక్కువ కావడంతో నాటిన మొక్కలు ఎండిపోకుండా నీటిని అందిస్తున్నారు. వికారాబాద్‌లోని రాజీవ్‌నగర్ సమీపంలో నుంచి అనంతగిరి వరకు రెండు వైపులా ఉన్న మొక్కలకు రోజు తప్పించి రోజు ట్యాంకర్‌తో నీరు పోస్తున్నారు. వేసవి మొత్తం మొక్కలను ఇలానే సంరక్షిస్తే వచ్చే జూన్ నాటికి చెట్లుగా మారి రోడ్డుకిరువైపులా పచ్చగా మారే అవకాశం ఉంది.

రిటైర్డ్ ఏఎస్పీ వేధింపులకు గురిచేస్తుండు

- ఎస్పీకి ఓ మహిళ ఫిర్యాదు
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

వికారాబాద్: రిటైర్డు ఏఎస్పీ వేధింపులకు గురిచేస్తున్నారని ఓ మహిళ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనపై బాధిత మహిళ ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్‌లో నివాసం ఉంటున్న రిటైర్డు ఏఎస్పీ, న్యాయవాది సాయికృష్ణ తనను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 12న రాత్రి 10.40గంటల వేళ మా ఇంటికి వచ్చి నానా మాటలు అంటూ దుర్భాషలాడారని పేర్కొన్నారు. గతంలో కూడా ఇలాగే వచ్చి నా భర్తను కొట్టి, గన్‌పెట్టి బెదిరించారని పేర్కొంది. ఈ విషయమై సీఐ శీను సంప్రదించగా బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పండుగ పూట విషాదం

- విద్యుత్ తీగ తెగి పైన పడటంతో షాక్
- గోపిగడ్డలో కౌలు రైతు మృత్యువాత

షాబాద్: పండుగ పూట విషాదం నెలకొంది. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తెగిపడి కౌలు రైతు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గోపిగడ్డ గ్రామానికి చెందిన జొన్నాడ ఆంజనేయులుగౌడ్(46) బుధవారం తన కొడుకు ధనుష్‌తో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. వరి పంటలో నీళ్లను చూస్తుండగా పైనుంచి తెగిన విద్యుత్ తీగ అతని చేతిపై పడింది. షాక్‌కు గురైన ఆంజనేయులు పొలంలోనే ప్రాణం వదిలాడు. కుటుంబమంతా సంతోషంగా ఉగాది పండుగను చేసుకునేందుకు సిద్ధమవగా.. పొలం వద్దకు వెళ్లివస్తానని చెప్పిన ఆంజనేయులుగౌడ్ మృత్యువాత పడ్డాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు హరీశ్‌గౌడ్, ధనుష్‌గౌడ్ ఉన్నారు. ఇదిలా ఉండగా విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని ఎన్నిసార్లు చెప్పినా.. అధికారులు, సిబ్బంది పట్టించుకోలేదని పలువురు రైతులు తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ నరేందర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



ఆంజనేయులు మృతదేహని పరిశీలిస్తున్న సీఐ గురువయ్యగౌడ్, ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి



పాంబండ దేవస్థానంలో భక్తజనసందోహం

పాంబండ.. ఆధ్యాత్మిక కొండ

కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల పరిధిలోని పాంబండ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు వేలాదిగా తరలివచ్చి రామలిగేశ్వరుడిని దర్శించుకున్నారు. శోభకృత్ నామ సంవత్సరంలో అంతా మేలు జరగాలని స్వామివారిని కోరుకున్నారు. బ్రహ్మోత్సవాలల్లో భాగంగా బుధవారం రాత్రి ఉత్సవమూర్తిని భజనలు, కోలాటాల మధ్య పల్లకీలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయపాలక వర్గం భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసింది. – కుల్కచర్ల

అడ్మిషన్ల కోసం కొత్త నాటకం!

- ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల వింతపోకడ
- మొత్తం ఫీజు చెల్లిస్తే 30 శాతం ఆఫర్ అంటూ మెసేజ్‌లు
- విద్యార్థుల తల్లిదండ్రులకు ఎస్ఎంఎస్‌లు, ఫోన్లు



వికారాబాద్ అర్బన్: పండుగల వేళ పేరు గాంచిన బంగారు దుకాణాలు, బట్టల దుకాణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులకు ఆయా సంస్థలు, కంపెనీలు ఆఫర్లు ఇవ్వడం చూస్తుంటాం. ఈ తరహాలోనే బడా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల ఆఫర్ ఇస్తూ పిల్లల తల్లిదండ్రులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. గతంలో విద్యాసంవత్సరం జూన్ మొదటి వారంలో ప్రారంభమయ్యేది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానంతో మార్చి 23నుంచే పై తరగతుల పాఠ్యాంశాలు బోధించడంతో పాటు, కొత్తగా అడ్మిషన్లను కూడా చేర్చుకుంటున్నారు. చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు ఫోన్లు చేస్తూ కొత్త అడ్మిషన్లు ఉంటే చూడండి అంటూ రెక్వెస్ట్ చేస్తుండటం గమనార్హం.

ఫీజుల దోపిడీ షురూ..

వార్షిక పరీక్షలు ముగియక ముందే ప్రైవేటు బడుల్లో ఫీజుల దోపిడీ ప్రారంభమైంది. ఫీజుల నియంత్రణ విషయంలో ప్రైవేటు యాజమాన్యాలు ప్రభుత్వ విధానాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కొన్ని పాఠశాలలు యథేచ్ఛగా 30శాతం ఫీజులు పెంచి తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని పాఠశాలలు ఓ వైపు ఫీజులు పెంచుతూ మరోవైపు ఫీజుల ఆఫర్ ఇస్తూ అడ్మిషన్లు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఇష్టానుసారంగా పెంచుతూ..

గత సంవత్సరం కొన్ని ప్రైవేటు పాఠశాలలో ఎల్‌కేజీలో చేరేందుకు సంవత్సరం ఫీజు చిన్న పాఠశాలల్లో రూ. 9,000, పెద్ద పాఠశాలల్లో రూ. 17వేలు తీసుకున్నారు. ఇప్పుడు అదే పాఠశాలలో ఎల్‌కేజీలో చేరాలంటే రూ. 13,500, పెద్ద పాఠశాలల్లో రూ.21వేలు వరకు పెంచి తీసుకునేందుకు నిర్ణయించారు. కార్పొరేట్ స్థాయిగా చెప్పుకుంటున్న పెద్ద పాఠశాలల్లో గత సంవత్సరం ఎల్‌కేజీలో చేరేందుకు బస్సు చార్జీలతో కలిపి రూ. 20వేలు వసూలు చేశారు. ఇప్పుడు ఆ ఫీజును రూ. 23,000లకు పెంచారు.

ఉపాధ్యాయులకు అడ్మిషన్ల టాస్క్..

ఆయా ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కొత్త అడ్మిషన్లు తీసుకురావాలని ఇప్పటి నుంచే యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయి. అడ్మిషన్లు అధికంగా తెచ్చిన వారికే ఉద్యోగ భద్రతతో పాటు, వేతనంలో పెంపు ఉంటుందని చెబుతున్నారు. దీంతో ప్రైవేటు ఉపాధ్యాయులు ఆయా క్లాసుల్లో ఉన్న విద్యార్థులతో కొత్త విద్యార్థులపై ఆరా తీస్తున్నారు.

ఇంటర్, డిగ్రీ కంటే ఖరీదు..

ఇంటర్, డిగ్రీ చదువుల కంటే పాఠశాలల చదువులు ఖరీదయ్యాయి. వికారాబాద్, తాండూరు, పరిగి వంటి పట్టణాల్లోని ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ వంటి గ్రూపులకు కళాశాల ఫీజులు రూ.25వేలకు మించి లేవు. హాస్టల్ ఫీజుతో కలిపితే 80వేలలో కళాశాలలో చేర్చుకుంటున్నారు. డిగ్రీలో బీఎస్సీ ఎంపీసీ, బీఎస్సీ బీజెడ్‌సీ వంటి ప్రాధాన్యత ఉన్న గ్రూపులకు సంవత్సరానికి రూ. 18వేలు మాత్రమే తీసుకుంటున్నారు. పై చదువుల కంటే పాఠశాల స్థాయిలోనే ఫీజులు ఎక్కువ చెల్లించాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

భద్రేశ్వర స్వామి జాతరోత్సవాలు


తాండూరు: రథ చక్రాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్,నాయకులు


తాండూరు: రథచక్రాల పూజా ఘట్టానికి తరలివచ్చిన భక్తులు

- ఉగాది రోజున ఉత్సవాలకు అంకురార్పణ
- రథ చక్రాలకు పూజలు చేసిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: పట్టణంలోని భావిగి భద్రేశ్వర స్వామి అలయ జాతర బ్రహ్మోత్సవాలకు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉగాది రోజున భద్రేశ్వర్ కూడలిలో స్వామి వారి రథ చక్రాలకు పూజలు చేసి ఉత్సవ పనులను మొదలు పెట్టడం అనవాయితీగా వస్తోంది. అందులో బాగంగా బుధవారం సాయంత్రం తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు రథ చక్రాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ ఏటా ఈ ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు వస్తారని, వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఉత్సవాలను అత్యంత వైభవంగా జరిపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, నాయకులు, వీర శైవ సమాజం సభ్యులు తదితరులున్నారు.

భద్రప్ప ఆలయంలో పంచాంగ శ్రవణం

తాండూరు టౌన్: పట్టణంలోని పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పండితులు శోభకృత్ నామ సంవత్సరం పంచాంగాన్ని భక్తులకు వినిపించారు. భావిగి భద్రేశ్వరాలయంలో జరిగిన పంచాంగ శ్రవణంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులకు సీఎం ఉగాది కానుక

సెర్ప్ ఉద్యోగులకు సీఎం కేసీఆర్ ఉగాది కానుక అందించారని ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం సెర్ప్ ఉద్యోగులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కృషితో జీఓ నెంబర్ 11ను విడుదల చేసి సెర్ప్ ఉద్యోగులకు నూతన పేస్కేల్ అమలుకు చర్యలు తీసుకున్నారన్నారు. నియోజకవర్గంలో సుమారు 4వేల మంది సెర్ప్ ఉద్యోగులు లబ్ధి పొందడం గర్వనీయమన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో సెర్ప్ ఉద్యోగుల కృషి మరువలేనిదని అందుకు సీఎం ఉగాది కానుకగా నూతన పేస్కేల్ విడుదల చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, నాయకుల్లు నర్సింహులు, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కవి సమ్మేళనం

అనంతగిరి: ఉగాది పండుగతో కొత్త ఆలోచనలతో అన్ని రంగాల్లో విజయం సాధించాలని సాహితి సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు, వేదపండితుడు సాంబశివశర్మ ఆకాంక్షించారు. బుధవారం ఉగాది సందర్భంగా సాహితి సమితి ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలోని మల్లికార్జున భవనంలో సాయంత్రం పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకుడు బస్వరాజు పంచాంగ విశేషాలు తెలిపారు. అనంతరం చేపట్టిన కవి సమ్మేళనంలో సమకాలీన అంశాలతో కూడిన కవితలు, పద్యాలు, పాటలు వినిపించారు. ఈ కార్యక్రమంలో సాహితి సమితి జిల్లా అధ్యక్షుడు వీరకాంతం , పట్టణ అధ్యక్షుడు అనంతపద్మనాభరావు, కార్యదర్శి పరమేశ్, దివాకరశాస్త్రి, వెంకటయ్య, సాహితి సమితి సభ్యులు, పుర ప్రముఖులు, కవులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మల్లికార్జున భవనంలో పంచాంగం చెబుతున్న అర్చకుడు బస్వరాజు

ఓయూలో నేడు భగత్‌సింగ్ సినిమా ప్రదర్శన

ఉస్మానియా యూనివర్సిటీ: భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట గురువారం భగత్‌సింగ్ సినిమాను ప్రదర్శించనున్నట్లు వామపక్ష విద్యార్థి నేతలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట సాయంత్రం 5 గంటలకు 'ద లెజెండ్ భగత్‌సింగ్' అనే చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. ఈ చిత్రాన్ని వీక్షించేందుకు అందరూ ఆహ్వానితులేనని.. యువత పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తలకు ఏ ఆపద వచ్చిన అండగా ఉంటానని కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిన్న నందిగామ గ్రామానికి చెందిన టీఆర్ఎస్ కార్యకర్త అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. దీంతో విషయం తెలసుకున్నా ఎమ్మెల్యే నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం నిమ్స్ ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలను డయాలసిస్ సెంటర్ డైరెక్టర్ గంగాధర్‌ను అడిగి తెలసుకున్నారు. ఎమ్మెల్యే వెంట చిన్న నందిగామ సాయిలు, తెలంగాణ సహకార గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి భీంరాజు, ఆదిత్య, గంగు తదితరులు పాల్గొన్నారు.


వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

పండుగ రోజు ఆలయాలకు తాళం!

సర్పంచ్‌పై గ్రామస్తుల ఆగ్రహం

ధారూరు: ఉగాది పర్వదినం రోజున గ్రామ దేవతల ఆలయాలకు తాళం వేయడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన జిల్లా పరిధిలోని తాండూరు మండలం కేరెళ్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ప్రతీ ఏడాది గ్రామదేవతలకు పూజలు చేసి నైవేద్యం, ఉగాది పచ్చడి సమర్పించడం ఆనవాయితీ. ఆలయానికి తాళం వేయడంతో బయట నుంచే పూజలు చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా దళిత యువకులు సర్పంచ్ ఉద్దేశపూర్వకంగానే తమను ఆలయాల్లోకి వెల్లకుండా తాళం వేశారని వాట్సాప్ గ్రూపుల్లో సందేశాలను పంపడంతో విషయం చర్చనీయాంశంగా మారింది. తాళాలు తీయించాలని సర్పంచ్‌ను కోరితే వాట్సాప్ గ్రూపునుంచి తొలగించారని యువకులు ఆరోపించారు. ఆయన పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


తాళం వేసి ఉన్న గాలి పోచమ్మ ఆలయం

'బురదజల్లేందుకే ఆరోపణలు'

తనపై బురదజల్లేందుకు కొందరు కావాలనే అసత్య ప్రచారం చేస్తున్నారని సర్పంచ్ నర్సింహారెడ్డి అన్నారు. రూ.80లక్షల వ్యయంతో రెండు గ్రామ దేవతల ఆలయాలను నిర్మించామని.. గాలి పోచమ్మ ఆలయంలోని రూ.40వేల విలువైన వెండి కిరీటం, హుండీ చోరీకి గురవ్వడంతో తాళం వేశామన్నారు. పూజలు చేసుకునే వారు తాళాలు తీసుకుని వెళ్లి పూజలు చేస్తారని వివరించారు. ఇదే విషయమై అవసరమైన వారు తాళాలు తీసుకువెళ్లి పూజలు ముగిశాక తిరిగి అప్పగించాలని సందేశం పంపానని సర్పంచ్ వివరించారు.

సాదత్‌ఖాన్‌కు పార్టీ రుణపడి ఉంటుంది

టీపీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్ మహరాజ్

యాలాల: మండలంలోని ముద్దాయిపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాదత్‌ఖాన్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్ మహరాజ్ అన్నారు. గత మంగళవారం సాదత్‌ఖాన్ మృతి చెందడంతో బుధవారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి నిఖార్సయిన నాయకుడిగా సాదత్‌ఖాన్ సేవలందించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పార్టీకి, మహరాజ్‌ల కుటుంబానికి ఆయన ఎంతో విధేయుడిగా ఉన్నారని గుర్తు చేశారన్నారు. సాదత్‌ఖాన్ కుటుంబానికి పార్టీ రుణపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మృతుడి కుటంబ సభ్యులు వాసిద్‌ఖాన్, మహ్మద్‌ఖాన్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు నర్సింహులు, ఉపాధ్యక్షుడు రాజుచారి, సీనియర్ నాయకులు ఆరీఫ్ హుస్సేన్, కటికె రవి, నవీన్‌గౌడ్, నర్సింహులుగౌడ్, బస్వరాజ్, సాజిద్, అఫ్జల్, షాహిద్ తదితరులు ఉన్నారు.


సాదత్‌ఖాన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రమేశ్ మహరాజ్

నీటమునిగి యువకుడి మృతి

తుర్కయంజాల్: నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్‌లో మునిగి తుర్కయంజాల్ మండలం కమ్మగూడకు చెందిన గౌని శివకుమార్ గౌడ్(32) మృతి చెందారు. ఈ సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. శివకుమార్ తుర్కయంజాల్ ఎస్‌బీఐలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. బుధవారం తోటి ఉద్యోగులు, మిత్రులతో కలసి కారులో వైజాగ్ కాలనీకి వెళ్లారు. చేపల వేటకు వినియోగించే బోటులో మిత్రులతో కలిసి సాగర్ బ్యాక్ వాటర్‌లో షికారుకు వెళ్లారు. బోటు ఒడ్డుకు వస్తున్న క్రమంలో శివకుమార్ నీటిలో పడి గల్లంతయ్యాడు. తోటి మిత్రులు, జాలర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గాలింపు చర్యల్లో శివకుమార్ మృతదేహం లభించింది. కేసు దర్యాప్తులో ఉంది.

బ్రహ్మానందంకు సన్మానం

బంజారాహిల్స్: ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో బుధవారం రాత్రి ఉగాది వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా హాస్యనటుడు, పద్మశ్రీ డాక్టర్ బ్రహ్మానందంను కల్చరల్ సెంటర్ సభ్యులు ఘనంగా సన్మానించారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు ఆది శేషగిరి రావు దర్శకుడు త్రివిక్రమ్ పాల్గొన్నారు.

పాలకులపై తిరుగుబాటు చేయాలి

పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

తాండూరు టౌన్: మహనీయులు పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని యువత, విద్యార్థులు కార్పొరేట్ పాలకులపై తిరుగుబాటు చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన ఆత్మబలిదానాలు చేసిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి వారోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన శ్రీనివాస్ మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలనకు చమటలు పట్టించి 23 ఏళ్ల ప్రాయంలోనే ఉరికొయ్యకు వేలాడిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ స్మృత్యర్థం గురువారం నుంచి ఈ నెల 30వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

వైభవంగా ఊయల సేవ

కొడంగల్ రూరల్: మహాలక్ష్మీ సమేత వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఊయల సేవ నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బాలాజీ కేజీ పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందికి కేఎస్‌పీ ఫంక్షన్ హాల్ నిర్వాహకులు మురహరి వసిష్ట బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ ఆడుతా.. పాడుతా.. తీయగా కమిటీ సభ్యులు గోపాల్, రామకృష్ణారెడ్డి పటేల్, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు విద్యార్థులను అభినందించారు.


ఊయల సేవలో పాల్గొన్న భక్తులు

భక్తితోనే మానసిక ప్రశాంతత

ఉప సర్పంచుల ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్: దైవ భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఉప సర్పంచుల ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు అల్లం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని కనకమామిడి అయ్యప్ప సన్నిదానంలో జై శ్రీరామ్ శబరిమల మహా పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అక్టోబర్ 27న పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఐదు సంవత్సరాల నుంచి అజీజ్‌నగర్ హనుమాన్ ఆలయ సన్నిదానం నుంచి పాదయాత్రగా అయ్యప్ప స్వాములు శబరిమలకు వెళ్తున్నారని తెలిపారు. ప్రస్తుతం అజీజ్‌నగర్ హనుమాన్ ఆలయం, కనకమామిడి అయ్యప్ప ఆలయం నుంచి భక్తులు శబరిమలకు వెళ్లనున్నట్లు తెలిపారు. పాదయాత్రగా వెళ్లే భక్తులు ముందుగానే తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గోవిందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో నేల, నీరు పదిలం

జిల్లా నాబార్డ్ మేనేజర్ షివి శర్మ

మహేశ్వరం: సేంద్రియ సాగుతో నేల, నీరు, వాతావరణం కలుషితం కాదని, ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులోకి వస్తుందని జిల్లా నాబార్డ్ మేనేజర్ షివి శర్మ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అమీర్‌పేట్‌లో రైతు నేస్తం ఆధ్వర్యంలో రైతు హరిబాబు వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కువ మంది రైతులు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. సేంద్రియ సాగుపై అవగాహన లేక అనుకున్న రీతిలో ఫలితాలు సాధించలేకపోతున్నారని తెలిపారు. సాగులో రసాయన మందుల వాడకాన్ని తగ్గించాలన్నారు. సేంద్రియ వ్యవసాయంతో దిగుబడి తోపాటు చీడపీడలు రావన్నారు. వివిధ రకాల కషాయాల తయారీ విధానాన్ని ఆదిలక్ష్మి , నారాయణ మనోహరాచారి ప్రత్యక్షంగా చూపిస్తూ వివరించారు. తక్కువ పెట్టుబడితో ఉద్యానవన పంటల సాగును రైతు హరిబాబు వివరించారు. వ్యవసాయ ఉత్పత్తుల గురించి రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు వివరించారు. అనంతరం రైతులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేశారు.


మాట్లాడుతున్న షివి శర్మ

జీతాల 'పంచాయితీ'

- పంచాయతీ కార్మికులకు అందని వేతనాలు
- మూడు నెలలుగా నిరీక్షణ
- రేపు మాపు అంటున్న అధికారులు
- అప్పుల ఊబిలో కుటుంబాలు


పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు

ఇబ్రహీంపట్నం రూరల్: పంచాయతీ కార్మికులు, సిబ్బంది బతుకులు అగమ్యగోచరంగా మారాయి. తెల్లవారుజామునే రోడ్లపైకి వచ్చి చెత్తాచెదారాన్ని శుభ్రం చేస్తున్నా వేళకు జీతాలు అందడం లేదు. గత డిసెంబర్ నుంచి నేటి వరకు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో బిల్ కలెక్టర్లు, కారోబార్లు, వాటర్ మెన్, కంప్యూటర్ ఆపరేటర్లు, కమోటీ, స్వీపర్లు పని చేస్తున్నారు. వీరంతా నాల్గవ తరగతి ఉద్యోగుల కంటే ధీనమైన పరిస్థితిలో జీవనం సాగిస్తున్నారు. బిల్ కలెక్టర్లు, కారోబార్లు మినహాయిస్తే మెజార్టీ పారిశుద్ధ్య పనులు చేసే వారు దళిత కుటుంబాలకు చెందిన వారే. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారిశుద్ధ్య కార్మికుడికి నెలకు రూ. 18 వేల జీతం ఇవ్వాలి. కానీ ఇదెక్కడా అమలు కావడం లేదు. ప్రతి పంచాయతీలో పని చేసే సిబ్బంది, కార్మికులకు రూ. 4వేల నుంచి మొదలుకొని రూ. 12వేల వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. ఇచ్చేది తక్కువ జీతమే అయినా నెలనెలా ఇవ్వడం లేదని, ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. రెండు రోజుల క్రితం ఒక నెల జీతం మాత్రమే చెల్లించినట్లు తెలిసింది. మండలంలోని 14 పంచాయతీల్లో 350 మంది వివిధ పనులు చేస్తుంటారు. వీరంతా జీతాల కోసం పడిగాపులు కాస్తున్నారు. పంచాయతీలు ప్రతి బిల్లునూ ట్రెజరీ ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆర్థిక శాఖ నుంచి సరైన మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో నెలలుగా చెక్కులు విడుదల కావడం లేదు. ఒక్కో పంచాయతీలో కనీసం తక్కువలో తక్కువగా 10లక్షల రూపాయల విలువ చేసే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో పంచాయతీలు ఉన్నాయంటే అర్థం చేసుకోవచ్చు. జీతాల కోసం పంచాయతీ కార్మికులు అధికారుల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సైతం సమాధానం చెప్పలేక మొహం చాటేస్తున్నారు.

అప్పులు చేస్తున్నాం



ఉదయం నుంచి సాయంత్రం వరకు పంచాయతీల్లో పనులు చేస్తున్నాం. కానీ జీతాలు మాత్రం సకాలంలో రావడం లేదు. పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేక పోతున్నాం. కుటుంబ పోషణ భారంగా మారింది. రేషన్ బియ్యంతో కాలం నెట్టుకొస్తున్నాం. ప్రతి నెలా క్రమం తప్పకుండా జీతాలు వస్తే బాగుంటుంది. ప్రభుత్వం ఆ దిశగా చొరవ తీసుకోవాలి.

– సుక్కమ్మ, పారిశుద్ధ్య కార్మికురాలు, కప్పపహాడ్

జీతాలు చెల్లించాలి



పంచాయతీ కార్మికులు, సిబ్బంది పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి. ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదు. కడుపు చేత పట్టుకొని గ్రామాలను శుభ్రం చేస్తారు. వారిని ఉపవాసం ఉంచితే ఎవరికీ మంచిది కాదు. సీఐటీయూ ఆధ్వర్యంలో జీతాలు ఇచ్చే వర కు పోరాటం చేస్తాం. కలెక్టర్ కార్యాలయాలు ముట్టడిస్తాం.

– జగదీష్ , సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

గౌడ్స్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్

మంచాల: గౌడ్స్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన నైనంపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికయ్యారు. బుధవారం నగరంలో నిర్వహించిన సంఘం విస్తృత స్థాయి సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు.రాష్ట్ర అధ్యక్షుడు అమరేందర్ గౌడ్ శ్రీనివాస్‌గౌడ్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను శక్తి వంచన లేకుండా నిర్వహిస్తానన్నారు. రాష్ట్రంలోని గౌడ కులస్తులను ఏకం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడమే కాకుండా వారిని చైతన్య పరుస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీ ప్రవీణ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి పీ మధుగౌడ్, నాయకులు నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాస్‌గౌడ్

క్లుప్తంగా

మైనార్టీ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక నేడు

కుల్కచర్ల: మండల పరిధిలోని మైనార్టీ ప్రజలకు మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సబ్సిడీతో కూడిన రుణాలను అందించేందుకు గురువారం కుల్కచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో లక్కీ డ్రా తీయనున్నట్లు ఎంపీడీఓ నాగవేణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఉదయం గురువారం ఉదయం 11గంటలకు కుల్కచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే ఎంపిక ప్రక్రియలో పాల్గొనాలన్నారు.

ఉత్తమ పంచాయతీలకు ప్రశంస పత్రాలు

నేడు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు సన్మానం

తాండూరు రూరల్: మండల పరిధిలోని 33 పంచాయతీలకు గాను 27 పంచాయతీలకు నేషనల్ అవార్డులు వచ్చినట్లు ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9 విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పంచాయతీలకు గురువారం మధ్యాహ్నం 2గంటలకు ఎంపీడీఓ కార్యాలయం వద్ద సర్పంచ్, కార్యదర్శులకు సన్మానం ఉంటుందన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దస్తయ్య

ధారూరు: మండల కేంద్రంలో ఆంజనేయ స్వామి ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేస్తున్నారు. ఈ ధ్వజస్తంభ ఏర్పాటుకు గ్రామానికి చెందిన వడ్డె దస్తయ్య బుధవారం రూ.లక్ష విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. మరో రూ.లక్ష త్వరలో అందజేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కావలి అంజయ్య, చాకలి లక్ష్మయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కలప తరలిస్తున్న లారీ సీజ్

కొడంగల్ రూరల్: అక్రమ రవాణాపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రవిగౌడ్ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని రావులపల్లి చెక్‌పోస్టు సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా కలప తరలిస్తున్న లారీని గుర్తించి అనుమతి పత్రాలు తనిఖీ చేయగా.. ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. తదుపరి చర్యలకు లారీని ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించినట్లు తెలిపారు.

రైతులకు స్వెటర్లు పంపిణీ


స్వెటర్లు అందజేస్తున్న నిర్వాహకులు

కొడంగల్: మండల పరిధిలోని పలు గ్రామాల పాల ఉత్పత్తిదారులైన 80 మంది రైతులకు బుధవారం స్వెటర్లు పంపిణీ చేశారు. పట్టణంలోని మస్కతి మిల్క్ సెంటర్ నిర్వాహకుడు దుబ్బాస్ సంజీవ్ తన తండ్రి జ్ఞాపకార్థం రైతులకు స్వెటర్లు ఇచ్చారు. ప్రతి ఏడాది రైతులకు అవసరమైన సామగ్రి అందజేస్తున్నామన్నారు. పాల క్యాన్లు, దుప్పట్లు, బ్యాగులు తదితర వస్తువులను గతంలో అందించారు. ఈ ఏడాది రైతుల కోరిక మేరకు స్వెటర్లు ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.